క్లుప్తంగా

విద్యుత్ కోతలతో అవస్థలు

తాళ్లూరు: మండల వాసులకు గడిచిన 15 రోజులుగా తరుచూ విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, ఈదురు గాలులు వీచినా, తుప్పర్లు పడినా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. వర్షాకాలం కావడంతో దోమలు అధికంగా ఉంటున్నాయి. ఇళ్లల్లో ఉండే వృద్ధులు, బాలింతలు, పిల్లలు గాలి కోసం ఆరుబయటకు రావాల్సి వస్తోంది. పొలాలకు నీరు అందించి పంట సాగు చేసుకునే రైతులు కరెంట్ కోసం ఎదురు చూసి ఇళ్లకు తిరిగి రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం కురిసిన చిన్నపాటి వర్షానికి రాత్రి 9 గంటలకు పోయిన విద్యుత్ ఉదయం వరకూ రాలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అంతరాయంపై గ్రామ పరిధిలో ఉన్న పవర్ ఆఫీస్‌లకు ఫోన్ చేస్తే స్థానికంగా లైన్‌మన్ అందుబాటులో లేరని చెప్తారన్నారు. తరుచూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినప్పుడు విద్యుత్ ఎప్పుడు వస్తుందాని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ విషయంపై ఏఈ రామకృష్ణారెడ్డిని వివరణ కోరగా వర్షం పడే సమయాల్లో ఉరుములు మెరుపులతో ఇన్సులేటర్లు మరమ్మతులకు గురవుతున్నాయని, వాటిని గుర్తించి మార్చే క్రమంలో సమయం ఎక్కువగా తీసుకోవడంతో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని స్పష్టం చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేయరాదు



ర్యాలీ చేస్తున్న చిన్నారులు

తాళ్లూరు: బహిరంగ ప్రదేశాల్లో మల,మూత్ర విసర్జన చేయరాదని, మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరావు కోరారు. మండలంలోని దారంవారిపాలెంలో మంగళవారం స్వచ్ఛతా హి కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం అవుతాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని చెప్పారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన ‘అన్నా’



ఎంపీ మిథున్‌రెడ్డితో మాట్లాడుతున్న అన్నా రాంబాబు

మార్కాపురం: ఎంపీ మిథున్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట మార్కాపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, శివరాంపురం గ్రామ సర్పంచ్ గురుబ్రహ్మం ఉన్నారు.

కౌన్సిలర్‌ను పరామర్శించిన ‘అన్నా’



కౌన్సిలర్‌ను పరామర్శిస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని 5వ బ్లాక్ కౌన్సిలర్ ముంగమూరి శ్రీనివాసులును వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మంగళవారం పరామర్శించారు. శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యానికి గురై వైద్యశాలలో చికిత్స అనంతరం మార్కాపురంలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న రాంబాబు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అన్నా వెంట పట్టణ పార్టీ అధ్యక్షుడు, కౌన్సిలర్ సలీమ్, యార్డు మాజీ చైర్మన్ గుంటక శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ నాయకులు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఆర్థిక చేయూత



ఆశ్రమానికి నగదు ఇస్తున్న పూర్వ విద్యార్థులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వివేకానంద కాలేజీలో 1969–70లో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక పీఆర్ కాలనీలో గల సంజీవని వృద్ధాశ్రమానికి మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులను పూర్వ విద్యార్థి రామచంద్రారెడ్డి, మిత్రబృందం అభినందించారు. పట్టణానికి చెందిన శేగు సాత్విక్ పుట్టిన రోజు సందర్భంగా నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

కోతుల స్వైరవిహారం



ప్రజలను భయపెడుతున్న కోతులు



కోతుల దాడిలో గాయపడిన సుబ్బాయమ్మ

తాళ్లూరు:

మండలంలోని తూర్పుగంగవరం, సోమవర్పాడు గ్రామ వీధుల్లో కోతుల స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల కాలంలో చిన్న పిల్లలు, మహిళలను ఇష్టానుసారం గాయపరుస్తున్నాయి. పదుల సంఖ్యలో ప్రజలు కోతుల దాడికి గురవుతున్నారు. దీంతో గ్రామ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రజలు రోజువారి పనుల రీత్యా బజారుకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. కోతులు ఇళ్లల్లోకి వచ్చి వస్తువులు తీసుకెళ్తున్నాయి. చిన్నారులు, వృద్ధుల చేతుల్లో తినుబండారాలను తీసుకెళ్తూ గాయపరుస్తున్నాయి. మంగళవారం ఉదయం సోమవర్పాడు గ్రామానికి చెందిన తాడికొండ సుబ్బాయమ్మ ఇంట్లో పనిచేస్తుండగా కోతులు కరవడంతో గాయపడింది. తూర్పుగంగవరంలోని ఓ ప్రైవేట్ క్లినిక్ వద్ద చికిత్స పొందారు. గతంలో కూడా పలువురు కోతుల దాడిలో గాయాలై చీమకుర్తిలోని ప్రైవేట్ వైద్యశాలలో వేల రూపాయలు ఖర్చు చేసినట్లు సమాచారం. సర్పంచ్, పంచాయితీ అధికారులు స్పందించి కోతుల బెడద లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి డి.నాగమల్లేశ్వరిని వివరణ కోరగా కోతులు పట్టేవారికి సమాచారం ఇచ్చామని, వీలైనంత త్వరగా వాటిని బంధించి అడవుల్లో వదిలి పెట్టేలా చర్యలు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తామన్నారు.

అధికారులు వెంటనే స్పందించాలి:



కోతుల దాడిలో పదుల సంఖ్యలో ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. ఇళ్లల్లోకి వచ్చి తినుబండారాలు ఎత్తుకెళ్తున్నాయి. ప్రజలు వీధుల్లో బయటకు రావాలంటే భయపడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టి వానరాల నుంచి ప్రజలను కాపాడాలి.

షేక్ లతీఫ్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు



అమ్మవారి దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే తాటిపర్తి


పుల్లలచెరువు: దుర్గాష్టమి సందర్భంగా మండలంలోని నరజాముల తండాలో జరుగుతున్న మంత్రాలమ్మా మారెమ్మ ఉత్సవంలో మంగళవారం యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖర్ అమ్మవారిని దర్శించుకుని పంటలు బాగా పండి ధరలు బాగా ఉండి రైతున్నలు సంతోషంగా ఉండేలా ఆశీర్వదించు తల్లీ..అని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈయన వెంట మండల పార్టీ కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఉడుముల అరుణ, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు బాలునాయక్, వెంకటేశ్వరనాయక్, రమణారెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు నాయక్ పాల్గొన్నారు.

ఒంగోలు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఒంగోలు వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం: స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలను పీపీపీ విధానం ద్వారా ప్రైవేట్‌కు కట్టబెట్టే చర్యలను నిలిపేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఒంగోలులో మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి మార్కాపురం నుంచి ఆ పార్టీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించాలన్నారు. వైద్యాన్ని ప్రైవేట్‌పరం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాదికైనా వైద్య కళాశాలను అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో తర్లుపాడు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, ఆదిమూలపు లూకా, రోజ్ లిడియా, బూదాల సతీష్ కుమార్, ఎం వరప్రసాద్, బత్తుల కాశయ్య, కటారి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



దర్శి: దుర్గాదేవిగా కనకదుర్గమ్మ



పెద్దదోర్నాల: మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు



పెద్దారవీడు: అలంకరణలో రాజ్యలక్ష్మి అమ్మవారు



దర్శి: దుర్గాదేవిగా పోలేరమ్మ తల్లి



కురిచేడు: దుర్గాదేవిగా జ్ఞానప్రసూనాంబ

వైభవంగా దుర్గాష్టమి



దొనకొండలో పూజలు చేస్తున్న భక్తులు



పుల్లలచెరువు: ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పెద్దదోర్నాల: దుర్గాదేవి శరన్నవరాత్రుల్లో అష్టమి తిథిన దుర్గముడు అనే రాక్షసుడ్ని సంహరించింది. ఆ అష్టమి దుర్గాష్టమిగా ప్రసిద్ధి పొందింది. దుర్గాదేవి ఆది ప్రకృతికి ఉన్న పంచ మహాస్వరూపాల్లో మొదటిది. అనంత శక్తివంతమైన ఈ రూపాల్లో అమ్మవారిని ధ్యానించినా, అనుగ్రహిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. దుర్గాష్టమి రోజు మహిషాసురమర్దిని అలంకారం నిర్వహిస్తుంటారు. శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో వెలసిన అమ్మవార్లకు భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీవాసవీ మాత అమ్మవారు దుర్గాష్టమిని పురస్కరించుకుని మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి అర్చకులు బి.రాంప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, చండీపారాయణం నిర్వహించారు. మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీలలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. స్థానిక పోలేరమ్మ ఆలయంలో నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పుల్లలచెరువు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. పుల్లలచెరువు కనకదుర్గ, శ్రీ బ్రహ్మం గారి ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దర్శి: విజయదశమి పండగను పురస్కరించుకుని దర్శిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను పూల మాలలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేశారు. కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో దుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. అష్టోత్తర శతనామావలి పూజా కార్యక్రమాలు చేశారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గా దేవిగా దర్శనం ఇచ్చారు. వీణ, పూలమాలలతో అందంగా అలంకరించారు. ఆలయంలో సామూహిక కుంకుమార్చన, హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. దద్దాలమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు కనకదుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

దొనకొండ: స్థానిక విరాట్ నగర్‌లో శ్రీఆనంద ఆశ్రమంలో వెలసిన ఈశ్వరి మహాదేవి అమ్మవారు 9వ రోజు మంగళవారం శ్రీకనకదుర్గమ్మగా దర్శనమిచ్చారు. ఉదయం 7 గంటల నుంచి గణపతి పూజ, అభిషేకాలు చేసి భక్తులకు ప్రసాదం అందజేశారు. 10వ రోజు బుధవారం మహిషాసురిడి సంహారం జరిగిన రోజు మహిషాసురమర్దినిగా దర్శనమిస్తుందని భైరవానంద స్వామి తెలిపారు. గుట్టమీదపల్లి గ్రామానికి చెందిన పిక్కిలి వీరభోగ వసంతరాయుడు, పద్మజ దంపతులు అల్పాహారం ఏర్పాటు చేశారు.

పెద్దారవీడు: విజయదశమి శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా మండలంలోని చట్లమిట్ల పంచాయతీ పరిధి రాజంపల్లె సమీపంలో వెలసిన శ్రీగొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు గాయత్రి అలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. అర్చకులు భవానీప్రసాద్, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, తదితర పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించి కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కురిచేడు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం శ్రీజ్ఞానప్రసూనాంబదేవి భక్తులకు శ్రీదుర్గాదేవిగా దర్శనమిచ్చింది. భక్తులతో ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యే పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



సీఐటీయూ జెండా ఆవిష్కరణలో నాయకులు, కార్మికులు

మార్కాపురం టౌన్: పోరాటాలతోనే కార్మికుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి పేర్కొన్నారు. మార్కాపురం మండలంలోని రాయవరం రైల్వేస్టేషన్ వద్ద సీఐటీయూ నాలుగో మహాసభలు ఎ.రంగమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వల్ల కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోయిందన్నారు. కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు, స్కీమ్ వర్కర్లు అందరూ ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో నిర్వహించే ఆలిండియా మహాసభలు స్ఫూర్తిగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్మికుల హక్కులు హరిస్తున్న ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు దాసోహమంటున్నాయని ధ్వజమెత్తారు. ముందుగా సీఐటీయూ జెండాను మండల కార్యదర్శి మండల కార్యదర్శి కె.వెంకటేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి రూబెన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా బాలనాగయ్య, మండల కార్యదర్శి టి.ఏడుకొండలు, శారా తదితరులు పాల్గొన్నారు.

గ్రామోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కంభం: శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ముందుగా హిందూ, ముస్లిం మత పెద్దల సూచనలు తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. దసరా గ్రామోత్సవంలో ప్రార్థనా మందిరాల వద్ద సంయమనం పాటిస్తూ, పోలీసుల సూచనల మేరకు ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం అన్ని మతాలవారు కలిసిమెలిసి ఉంటున్నారని, ఒకరిద్దరు చేసే అల్లరి పనుల వల్ల సామరస్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆలయ కమిటీల సభ్యులు జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐ కె.మల్లికార్జున, ఎస్సై నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

70 మందికి హోమియో వైద్య పరీక్షలు

బేస్తవారిపేట: మండలంలోని మోక్షగుండంలో హోమియో వైద్యశాల డాక్టర్ పి.గిరిధర్, మార్కాపురం డాక్టర్ సైదుబాబు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది రంగారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల 16 మంది జూదరుల అరెస్టు

బేస్తవారిపేట: మండలంలోని జేబీకే పురం సమీపంలోని పొలాల్లో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.13,050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని ఈగలపాడు గ్రామ వ్యవసాయ పొలాల్లో పేకాట శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. 9 మంది జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.62,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వేమన తెలిపారు.

గిద్దలూరులో వార్డుల సంఖ్య పెంపు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 20 వార్డుల సంఖ్యను 27కు పెంచనున్నట్లు స్థానిక కమిషనర్ ఈవీ రమణబాబు తెలిపారు. ఓటర్ల పెరుగుదల, పురపాలక అభివృద్ధి తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని వార్డుల సంఖ్య పెంచుతున్నామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు వార్డుల పెరుగుదల దోహదపడుతుందని తెలిపారు.

కార్యకర్తల రక్షణకే డిజిటల్ బుక్

- కూటమి నేతల వేధింపులకు భవిష్యత్‌లో శిక్ష తప్పదు
- ప్రజా సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసింది
- డిజిటల్ బుక్ ఆవిష్కరణలో వైఎస్సార్ సీపీ నేతలు

బేస్తవారిపేట: టీడీపీ, జనసేన శ్రేణుల దాడులు, పోలీసులు, ఇతర అధికారుల దౌర్జన్యాలతో ఇబ్బందులకు గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నేతలకు అండగా నిలిచి రక్షణ కల్పించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ క్యూర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చారని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బేస్తవారిపేటలో డిజిటల్ బుక్ క్యూర్ కోడ్ స్కానర్‌ను ఆవిష్కరించారు. ఎక్కడైనా పార్టీ శ్రేణులకు అన్యాయం జరిగితే వెంటనే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలు నమోదు చేయాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా బాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మల్లెల శేఖర్‌రెడ్డి, యూత్ వింగ్ కన్వీనర్ మాచర్ల వెంకటేశ్వరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చిరంజీవి, మాజీ ఎంపీపీ వెంకటరాజు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, నాయకులు పి.ఈశ్వరరెడ్డి, కొండా రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపేందుకు వైఎస్ జగనన్న డిజిటల్ బుక్ తీసుకొచ్చారని మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత డిజిటల్ బుక్‌లో నమోదైన బాధితులకు అండగా నిలబడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బి.ఓబులరావు, మున్సిపల్ అధ్యక్షుడు మానం బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, బిక్కా రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంభం: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి అధ్యక్షతన మంగళవారం సాయంత్రం డిజిటల్ బుక్ యాప్, క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి నెమలిదిన్నె చెన్నారెడ్డి మాట్లాడుతూ యాప్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మహబూబ్ పీరా, పెద్దకోటేశ్వరరావు, సయ్యద్ ఖాసిం, రఫి, ఆనంద్, సయ్యద్ సలీం, సబ్బసాని సాంబశివారెడ్డి, హుస్సేన్‌బాష, సురేష్, గురుమూర్తి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్‌ను జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రవికుమార్, ఎంపీటీసీ షేక్ సుబానీ, నాయకులు మోహన్‌రెడ్డి, వెంగయ్యచౌదరి, గోల్కొండ సుబానీ తదితరులు పాల్గొన్నారు.